## మినీ కథ



# సుబ్బారావు కరాటే

ఎ. రజనీనాగిన్

"హా...హా, హా, హా" అని అరుస్తూ ఆయాసంతో ఎగురుతున్నాడు సుబ్బారావు

"ఇదేమి కాకిగోలండి బాబూ ప్రొద్దునే మీ అరుపులకు చంటాడు లేచి ఆపకుండా ఏడుస్తున్నాడు" అంటూ వచ్చింది సుబ్బారావు భార్యామణి సుబ్బలక్ష్మి.

సుబ్బారావు ఆ మాటలు తనకు కానట్టు తనపనిలో నిమగ్నమైనాడు.

"మీకేనండి చెప్పేది. త్వరగా వెళ్ళి పాలు తీసుకురండి" అని విసుక్కుంటూ లోపలకు వెళ్ళింది సుబ్బలక్ష్మి.

ఇక తప్పదన్నట్టు ప్యాంటు, షర్టువేసుకొని బజారున పడ్డాడు సుబ్బారావు. మనసంతా నిన్న చూసిన బ్రూస్‌లీ సినిమా మీదే వుంది. ఆ సినిమా చూసిన క్షణంలోనే కరాటేలో బ్రూస్‌లీని మించిపోవాలనుకున్నాడు సుబ్బారావు. ఇంతలో తన కాలర్‌ను పట్టుకొని ఎవరో వెనక్కు లాగారనిపించి, వెనక్కు తిరిగిన సుబ్బారావు గుండె వేగం రాజధాని ఎక్స్‌ప్రెస్‌ని మించిపోయింది. చీపురుకట్ట తిప్పి పట్టుకుని కాళిలా నిల్చున్న గంగమ్మను చూసేసరికి ఆమె కష్టపడి మూడు గంటలు మొగుడిచేత వేయించిన రథం ముగ్గు త్రొక్కానని పాపం సుబ్బారావుకి అప్పుడు తెలిసింది.

ఎట్లాగో కష్టపడి గంగమ్మ చేతిలోని కాలర్ విడిపించుకుని పాలు తీసుకొని ఇంటికి బయల్దేరాడు సుబ్బారావు. బ్రూస్‌లీ కలల్లో విహరిస్తూ ఈసారి సుబ్బారావు రోడ్డుపై కమ్మగా నిదురపోతున్న ఒక కుక్కతోక త్రొక్కాడు. నిద్రాభంగం కాబడ్డ ఆ కుక్క వీరావేశంతో సుబ్బారావు మీద పడబోయింది. ఆ సమయంలో సుబ్బారావుకి రాత్రి సినిమాలో బ్రూస్‌లీ ఎలా కాలెత్తి కిక్ కొట్టాడో కళ్ళముందు కనబడింది. 'వెంటనే జై బ్రూస్‌లీ' అంటూ కుక్కమీదకు కాలెత్తాడు.

పర్‌ర్‌ర్‌ర్‌మని చిరిగిన శబ్దం, తర్వాత కుక్క మీద పడడం వెంట వెంటనే జరిగిపోయాయి. కొన్ని పాలు నేలపాలుచేసి ఇక జన్మలో టైట్‌ప్యాంట్‌తో కరాటే చేయకూడదని బుల్లెట్‌లా ఇంటివైపుకు పరిగెత్తాడు కరాటే సుబ్బారావు.

వాకిట్లో నిలబడి ఎదురు చూస్తున్న సుబ్బలక్ష్మి ఉత్త చేతులతో తిరిగి వస్తున్న భర్త కనబడగానే కోపంతో తారాజువ్వలా పైకెగిరింది. సుబ్బారావు శాంతంగా కాళ్ళు కడుక్కోవడానికి పెరట్లోకి వెళ్లాడు. ఎదురుగావున్న పని పిల్లను చూస్తూ, ఒక కాలు ముందున్న ఇటుకరాయిపై పెట్టిన వెంటనే, ఒక్క క్షణం భూమి తిరుగుతున్నట్టు అనిపించింది సుబ్బారావుకి. ఆ తరువాత కళ్ల ముందు నక్షత్రాలు కనపడ్డాయి. ఆ రాయిక్రింద నిన్న తను తిని పడవేసిన అరటితొక్క వుంటుందని ఊహించలేకపోయాడు సుబ్బారావు.

ఇంతలో పనిపిల్ల నవ్వు వినిపించేసరికి, నక్షత్రాలు ఎంచడం సగంలో ఆపి, నడుం నొప్పిని కూడా లెక్కచేయకుండా జై బ్రూస్‌లీ—అని అరచి, బాగా నీళ్ళలో నాని వున్న ఆ ఇటుకరాయిని కుడిచేత్తో ఒక గుద్దు గుద్దాడు. అది రెండు ముక్కలయింది. ఇక సుబ్బారావు ఆనందానికి సర్ ఆర్థర్ కాటన్ కూడా ఆనకట్ట వేయలేకపోయాడు.

సక్సెస్ గ్రాండ్ సక్సెస్ అంటూ అరుస్తూ పొయ్యిమీద పాలు పొంగుతాయని చెబుతున్నా వినకుండా సుబ్బలక్ష్మిని, రానని ఏడుస్తున్న చంటాడిని పెరట్లోకి లాక్కెళ్ళాడు. ఇంతలోనే పక్కింటి బామ్మగారొస్తే ఆమెను, బామ్మగారి కోడలినీ పిల్చి—

ఆ తరువాత ప్యాంటు చిరిగిందని కూడా మరచి ఓ రెండు నిమిషాలు కాళ్ళూ చేతులు గాలిలో వూపాడు. సుబ్బలక్ష్మి వారిస్తున్నా వినకుండా వరుసగా ఒక దానిపైన ఒకటి ఆరు ఇటికలు పేర్చి, అందరూ ఇటే చూడాలని ఆజ్ఞ జారీచేసి, జై బ్రూస్‌లీ అని అరుస్తూ, కుడిచేత్తో వున్న బలమంతా వుపయోగించి ఇటుకలపై కొట్టాడు. మరుక్షణం పటపట మని విరిగిన శబ్దం అందరికీ వినబడింది. ఆ ఆరు ఇటుకలలో ఏ ఒక్కటీ ఒక చిన్న బీటఅయినా యివ్వలేదు.

ది గ్రేట్ కరాటే వీరుడు సుబ్బారావు ఆ రోజు సాయంత్రం ఎముకల స్పెషలిస్ట్‌తో అరగంట మాత్రమే సంప్రదింపులు జరిపాడు.

